# బొమ్మల చొక్కా

"ఛీ! నాకీ చొక్కా వొద్దు...!"

బళ్ళోంచి వొస్తూనే, బొత్తాలు విప్పి చొక్కాని విసురుగా ఓ మూలకి విసిరేస్తూ గట్టిగా అరిచేడు నారాయణ. వాడి మాటలకి గైరమ్మ విస్తు పోయింది. చేతిలో పని అలా వదిలేసి, వాడి ముఖంలోకి వింతగా చూస్తూ ఉండి పోయింది. పొద్దున్న కళ కళ లాడుతూ, కొత్త చొక్కా తొడుక్కుని దర్జాగా సంబరంతో బడి కెళ్ళిన కొడుకు ధుమ ధుమలాడుతూ రావడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. కొత్త చొక్కా వేసుకోబోతున్న ఆనందంతో వాడికి ముందు రోజు రాత్రి సరిగా నిద్ర కూడా పట్ట లేదన్న సంగతి గైరమ్మకి గుర్తుంది. రోజూ కన్నా పెందలాడే నిద్ర లేచి పోయి,స్నానం అదీ చేసి, ముస్తాబయి పోయేడు. పసుపు పెట్టిన కొత్త చొక్కా వేసుకున్నాక వాడి ముఖం ఆనందంతో వెలిగి పోయింది. చద్ది మెతుకులు నోట్లో కుక్కు కుని హుషారుగా చాలా ముందుగానే బడికి బయలు దేరి పోయేడు. అలాంటిది - బడి నుంచి వస్తూనే చిరాకు పడి పోవడం, ముచ్చట పడి కుట్టించుకున్న కొత్త చొక్కా మూలకి గిరాటు వేసెయ్యడం చూసి గైరమ్మకి వాడి ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు. నులక మంచం నేస్తూ కూచున్న కొండయ్య పరిస్థితీ అలాగే ఉంది. కొడుకు ముఖం ఎందుకో చిట పటాడి పోతోంది. రోజూ బడి నుంచి యింటికి వచ్చేటప్పుడు వాడి ముఖంలో కనిపించే హుషారు ఇవాళ మచ్చుకైనా కనిపించడంలేదు.

'అయ్యా, బొమ్మల చొక్కా కొని పెట్టవూ?!' అంటూ చాలా రోజులుగా తనని వేధించుకు తిన్నాడు. డబ్బులు జత పడక తను అదిగో, యిదిగో అంటూ వాయిదా వేస్తూ వచ్చేడు. ఒక్కో రోజు కోపం వచ్చి, అన్నం తినడం మానేసి పడుకునే వాడు నారాయణ. ఒకటి రెండు సార్లు కొత్త చొక్కా కోసం ఏడ్చి తన చేత తన్నులు కూడా తిన్నాడు. బొమ్మల చొక్కా తొడుక్కోవాలనే కొడుకు ముచ్చట చూసి, పదీ పరకా దాచి, ఎలాగయితేనేం కొత్త చొక్కా కుట్టించేడు తను. కొత్త బొమ్మల చొక్కా కుట్టించి తను యింటికి తెచ్చి నప్పుడు వాడి సంతోషం అంతా యింతా కాదు. వెర్రి సంతోషంతో ఇల్లంతా లేడి పిల్లలా ఎగిరి గంతులు వేసాడు.

గైరమ్మ నాలుగైదు ఇళ్ళలో పాచి పనులు చేస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు, వాళ్ళూ వీళ్ళూ యిచ్చిన పాత చొక్కా నిక్కర్ల తోనే నారాయణకి గడుస్తోంది. ఆ చిరుగులు పట్టిన పాత బట్టలు వొంటి మీద వేలాడుతూ వుంటే, యిష్టం లేక పోయినా, వాటితోనే కాలక్షేపం చెయ్యక తప్ప లేదు వాడికి. కూలి పని చేసి తను తెచ్చేది కూటికే చాలడం లేదు. ఇక కొడుక్కి కొత్త బట్టలేం కొని పెడతాడు?

చాలా రోజులుగా ఉన్న రెండు చొక్కాలూ బాగా చిరుగులు పట్టేయని కొడుకు ఏడుస్తూ ఉంటే వాడి బాధ చూడలేక, ఎలాగయితే నేం ఓ కొత్త చొక్కా కుట్టించి యివ్వదానికి సిద్ధ పడ్డాడు. కొత్త చొక్కా కొని పెడతానని తను అనగానే ఏనుగెక్కినంత సంబర పడి పోయేడు నారాయణ. తన మెడ చుట్టూ చేతులు వేసి, నడ్డి మీదకి ఎగబాకుతూ 'ఓరయ్యా...మరయితే నాకు బొమ్మల చొక్కా కొనియ్యాల...ఏం?' అనడిగేడు మురిపెంగా. బొమ్మల చొక్కా అంటే వాడి కున్న మోజు చూసి ముచ్చట వేసింది తనకి. ఆ తర్వాత వాడు రోజూ బొమ్మల చొక్కా గురించి అడగడమే... గైరమ్మ తను పని చేసే యిళ్ళ వారి నడిగి అడ్వాన్సుగా కొంత డబ్బు తెచ్చింది. ఈ లోగా కూలి డబ్బుల లోంచి అతి కష్టం మీద మిగిల్చిన డబ్బులు జత చేసి, ఎలాగయితేనేం నారాయణ కోరిక యిన్నాళ్ళకి తీర్చ గలిగేడు. ఉదయం బడికి బయలు దేరుతూ, బొమ్మల చొక్కా వేసుకుని "అయ్యా ఎలా ఉంది?" అంటూ వెలిగి పోతున్న ముఖంతో తన ఎదుటికి వచ్చి అడిగేడు.

ఆ కొత్త చొక్కాలో నారాయణని చూసి నిజానికి తనకి కూడా ఎంతో సరదా వేసింది.. నిక్కరు పాతదే అయినా, కొత్త బొమ్మల చొక్కా తళ తళ మెరిసి పోతూ ఉండడంతో ఆ సంగతి మరుగున పడి పోయింది. డబ్బు కట్టల బొమ్మలతో ఆ చొక్కా – వింతగా చూడ్డానికి ఎంతో బాగుంది.పదులు, ఏభైలు,వందలు కట్టలు కట్టలుగా బొమ్మల రూపంలో ఆ చొక్కా నిండా కనిపిస్తున్నాయి. బట్టల కొట్టు వాడు ఎన్నో రకాల బట్టల తాన్లు చూపించి నప్పటికీ, తనకి డబ్బుల కట్టలు ముద్రించిన యీ బట్టే ఎంతో నచ్చింది. 'బేంకిల డబ్బంతా నీ వొంటి మీదే వుందిరయ్యా...' నవ్వుతూ నారాయణతో అన్నాడు. ఆ మాటలకి కొడుకు ఉప్పొంగి పోయేడు. నడుస్తున్న బ్యాంకులా మహా గర్వంగా యిళ్ళంతా కలియ తిరిగేడు.

'నా బిడ్డ రాజా! ఆడికేటి...పెద్దయితే యిలగంటి నోట్ల కట్టలు జేబిల నిండా ఉంటాయి. ఉప్పుడు డబ్బు కట్టల కొత్త జుబ్బా యేసుకుంతాడు...అప్పుడు నోట్ల కట్టలు ఇనప్పెట్టిల నిండా మనకి సంపాయించి యిస్తడు..." గైరమ్మ పొంగి పోతూ అంది. ఆ మాటలతో నారాయణకి మరీ సంతోషం వేసింది. లోకంలో డబ్బంతా ఆ క్షణంలో తనొక్కడి స్వంతమే అయి పోయి నట్టు ఉప్పొంగి పోతూ, తుళ్ళుతూ బడికి పరిగెట్టాడు. "బళ్ళోంచి వచ్చేక ఆడికి దిష్టి తియ్యాలె..." "అవును నానూ అదే అనుకుంతున్నాను..." కొడుకు వెళ్ళిన వేపే అపేక్షగా చూస్తూ అంది గైరమ్మ. అంత అట్టహాసంగానూ, సంతోషంగా బడికి వెళ్ళిన నారాయణ – యింటికి జావ కారి పోయినట్టు రావడం వాళ్ళకి మతి పోయినట్టు చేసింది. కొంచెం సేపు ఆ యిద్దరూ ఏమీ మాట్లాడ లేక పోయేరు. ఎంతో అపురూపంగా కుట్టించుకుని, తొడుక్కున్న బొమ్మల చొక్కా , వాడికి అంతలోనే చేదు విషంలా ఎందుకు మారి పోయిందో వారికి అర్థం కావడం లేదు.

నారాయణ కళ్ళలో పెల్లుబుకుతున్న కన్నీటిని చూసి, వాళ్ళు చలించి పోయేరు. కొండయ్య నారాయణ దగ్గరకి వెళ్ళి, చేత్తో తల నిమురుతూ, లాలనగా అడిగేడు: "ఏటయింద్ర...అసలేటి జరిగింది సెప్పు?" అని. "మీ అయ్య దీన్ని తెచ్చి నప్పుడు సేన బాగుందని సంబర పడనేదా! పెందిల దాన్ని ఏసుకుంటూ, అబ్బోసి, ఓ ఎలుగు ఎలిగి

పోసేదా!... అలపింటిది...ఉప్పుడేటి యిలా... ఆ బొమ్మల చొక్కా వొద్దంటే వొద్దని ఇసిరి కొడుతున్నావురొరే...ఇదేం సోద్దెమోలమ్మ..." గైరమ్మ కళ్ళు పెద్దవి చేసుకుంటూ అడిగింది నారాయణని. వాడు కళ్ళెగరేసి, వాళ్ళ వేపు దు:ఖంతో ఉబ్బిపోయిన కళ్ళతో చూసాడే కానీ, వాళ్ళ ప్రశ్నకి జవాబు మాత్రం చెప్ప లేదు.

ఏం జరిగిందో తెలుసుకుందామని, కొండయ్య గైరమ్మలు వాడ్ని నయానా భయానా అడిగి చూసేరు.కాని లాభం లేక పోయింది. మోకాళ్ళలో ముఖం దాచుకుని, ఓ మూల చేరి ఏడుస్తూ ఉండి పోయేడు. వాడు మరింక ఆ కొత్త బొమ్మల చొక్కా వేసుకోడని తేలి పోయింది. తనకి ఆ బొమ్మల చొక్కా కుట్టించడం కోసం తల్లీ తండ్రీ దాదాపు నెల రోజులుగా ఒక్క పూటే తిండి తిన్నారని వాడికి తెలియదు.

అలాగే -

ఆ రోజు బళ్ళో మేష్టరు కొత్త పుస్తకం యింకా ఎందుకు కొనలేదని నారాయణని అడిగితే "మా కాడ డబ్బులు నేవండీ..." అని నారాయణ బదులు చెప్పేడనీ -

"రాస్కెల్... నీ చొక్కా నిండా డబ్బేరా! పుస్తకం కొనడానికి మాత్రం డబ్బులు లేవూ?" అంటూ వెటకారంగా తిడుతూ బెత్తంతో యిష్టం వచ్చినట్టు మేష్టరు చితక బాదేడనీ - ఆ తల్లి దండ్రులకి తెలీదు! చొక్కా మోజులో, పుస్తకం కొనుక్కోవాల్సి ఉందని వాడు యింట్లో చెప్పనే లేదు. ఆ మర్నాడు - చిరిగిపోయిన పాత చొక్కా వేసుకుని, బడికి బయలు దేరాడు నారాయణ.

అప్పుడు వాడు... నడుస్తున్న బ్యాంకు లాగా కాక - చిరిగి పోయిన నోటు లాగానో, చెల్లని సత్తు నాణెం లాగానో ఉన్నాడు.

* * *

*ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక 1994 లో ప్రచురణ.*